క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తుల స్వీకరణ



కోస్గి: ఈ ఏడాది కొత్తగా పట్టా పుస్తకాలు పొందిన రైతులతోపాట గతంలో తమపేర్లు నమోదు చేసుకోని రైతులు రైతు బీమాకు ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ నవ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం గుండుమాల్‌లోని హన్మాన్‌పల్లి క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో అర్హులైన రైతులనుంచి దరఖాస్తులు తీసుకున్నారు. దరఖాస్తుదారులు కొత్తగా పట్టాపాసు బుక్కులు పొంది ఉంటే ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, నామిని ఆధార్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓతోపాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తాం

నర్వ: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘం పనిచేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న అన్నారు. శుక్రవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.. నేడు శనివారం పీఏసీఎస్ ఆవరణలో నిర్మించిన క్రిమిసంహారక మందులు, ఎరువుల దుకాణ సమాదాయాన్ని, ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, డైరెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, లింగన్న, పల్లె శేఖర్ పాల్గొన్నారు.

కోస్గి ఎంపీడీఓగా శ్రీధర్

కోస్గి: మండల ఎంపీడీఓగా శ్రీధర్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ సాయిలక్ష్మీ దామరగిద్ద మండల ఎంపీడీఓగా బదిలీ కాగా దామరగిద్ద మండల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ కోస్గికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్న ఆయనను కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

మరికల్: నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే ఏఐటీయూసీ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ నెల 3, 4 తేదీలో నిర్వహించే ఏఐటీయూసీ కార్మిక సంఘాల శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవతంతం చేయాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం



మాగనూర్: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎంపీఓ జైపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అబీబ్, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణరెడ్డి, అటెండర్ గొల్ల వెంకటయ్యలకు శాలువాతో సన్మానించారు. ఈ మేరకు.. వారు చేసిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న గోవిందమ్మకు శుక్రవారం ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డా నరేందర్ ఏఎన్ఎం అనిత, ఆశా కార్యకర్తలు ప్రియాంక, సూరమ్మ, పద్మ, నర్సమ్మ, అనసూయ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



నారాయణపేట రూరల్: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న రూ.2లక్షల రుణమాఫీ పథకంలో అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకోబ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. తప్పులను సరిచేసి ప్రతి రైతుకు న్యాయం జరిగేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అనంత్‌రెడ్డి, మల్లప్ప, మహిపాల్, నరేష్, చంద్రు, శివరాజు, మల్లేష్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మకు బోనాలు

మద్దూరు: అషాఢమాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని కొత్తపల్లిలో ఈదమ్మకు బోనాలేత్తారు. ఉదయం ఈదమ్మకు కలశ ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు ఊరేగింపుగా బోనాలతో వెళ్లి అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు.



కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి

- మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి రూ.3,310
- గ్రామీణ వారాంతపు సంతలో కిలో రూ.50కి విక్రయం



మార్కెట్‌లో ఉల్లిగడ్డ విక్రయిస్తున్న వ్యాపారస్తులు (ఫైల్)

మరికల్: ఉల్లి ధర చుక్కలు చూడటంతో అటూ వ్యాపారస్తులు, ఇటూ వినియోగదారులు ఉల్లి ఘాటుకు తట్టుకోలేకపోతున్నారు. ఈ ఏడాది ఉల్లి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో మార్కెట్‌లో ధర చుక్కలు చూస్తుంది. దీంతో చేసేది లేక వ్యాపారులతో వినియోగదారులు వారంతపు సంతలో కేజీ ఉల్లికి రూ. 50 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. సీజన్ ముగిసిన ఉల్లి ధరల ఘాటు పెరగడమే తప్ప దిగి రావడం లేదు. సీజన్ ముగిసి దిగుబడులు తగ్గిన తర్వాత ఉల్లిధర పైపైకి ఎగబాకుతుంది. ఈ ఏడాది జనవరిలో రూ. 2వేలు దాటని ఉల్లి ధర మే తర్వాత రూ. 2500 దాటింది. జూన్ రెండోవారం నుంచి ఒక్కసారిగా ఉల్లి ధరలు ఎగిసిపడ్డాయి. ఏకంగా రూ. 3వేల మార్కు దాటిపోయింది. జూలై ముగుస్తున్న ధరలు మాత్రం తగ్గడం లేదు. సీజన్ ముగిసిన తర్వాత ధరలు పెరుగుతాయని భావించిన కొందరు రైతులు నిల్వచేసుకొని ప్రతివారం కొంత మేరా అమ్మకానికి మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు. దేవరకద్ర మార్కెట్‌లో క్వింటాల్ గరిష్టంగా రూ. 3,310 పలికింది. కనిష్టంగా రూ. 2,670 ధర పలుకుతుంది.

తగ్గిన సాగు..

మరికల్ మండలంలో గతేడాది కంటే ఈ ఏడాది అతితక్కువగా ఉల్లిసాగు చేశారు. దాదాపు అధికారుల అంచనా ప్రకారం మండలంలో 612 ఏకరాల్లో ఉల్లి సాగుచేశారు. దీనికి తోడు పంట చేతి కొచ్చే సమయంలో వర్షాలు లేక బోర్లలో భూ గర్భజలాలు అడుగంటాయి. దీంతో దిగుబడి పూర్తిగా తగ్గింది. కోత ప్రారంభం సమయంలో కొందరు నేరుగా రైతుల దగ్గరకు వెళ్లి క్వింటాల్ రూ. 1000 చొప్పున కొనుగోలు చేశారు. అప్పట్లో రైతుల వద్ద కొనుగోలు చేయని వారికి ఇప్పుడు ఉల్లి వారికి చుక్కలు చూపిస్తుంది. చిరు వ్యాపారస్తులు వారం తపు సంతలో గ్రామీణ అంగట్లో కేజీ ఉల్లిని రూ. 40నుంచి 50మధ్యన విక్రయిస్తున్నారు. సంతకు రూ. 200 తీసుకెళ్తే ఉల్లికే రూ. 50 పోగా, టమాటకు రూ. 50పోతే, మిగితా రూ. వందకు ఏ కూరగాయాలు రాని పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి, పేద ప్రజలు కూరగాయాలను కొనలాంటనే జంకుతున్నారు.

నష్ట పోతున్నాం..



రైతులు పండించిన సమయంలో మద్దతు ధరలు లేక తక్కువ ధరకే అమ్ముకొని తీవ్రంగా నష్టపోయాం. ఉల్లి అమ్మిన తర్వాత మార్కెట్‌లో వారం, వారం ధరలు పెరగడంతో క్వింటాల్ వెంబడి రూ. 2000 వరకు నష్టం చావి చూశాం. ఇంట్లో నిల్వ చేసుకుంటే మురిగిపోతుంది. రైతులు పండించిన ఉల్లికి ప్రతి ఏడాది కనీస మద్దతు ధర ఉండాలి.

\- హన్మంతు, ఉల్లిరైతు, పల్లెగడ్డ

కొనాలంటేనే భయమేస్తోంది..



పెరిగిన ధరలను చూస్తే ఉల్లిని కొనలాంటేనే భయమేస్తోంది. కూరగాయాల్లో ఉల్లి తప్పనిసరి కాని పెరిగిన ధరలకు తినడమే మానేసాం. రైతుల దగ్గర నుంచి తక్కువ ధరలకు కొనుగోలుచేసి గోదల్లో నిల్వ ఉంచి ధరల పెరుగుదలకు కారణమైన దళారి వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే ఉల్లి ధరలు ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

\- మణెమ్మ, మరికల్

అటెన్షన్ ప్లీజ్





గుంతలమయంగా రోడ్డు

మరికల్ మండలంలోని లాల్‌కోట చౌరస్తా నుంచి కోయిల్‌సాగర్ వరకు వెళ్లే ప్రధాన రోడ్డు మరమ్మతులకు నోచుకోలేక గుంతలమయంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కోయిల్‌సాగర్‌కు వెళ్లే పర్యాటకుల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. లాల్‌కోట చౌరస్తా నుంచి పూసల్‌పహాడ్, కోయిల్‌సాగర్ వరకు వెళ్లే గ్రామస్తులు కూడా గుంతల రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

\- మరికల్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నారాయణపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ శివశంకర్



మక్తల్‌లో నంబర్ ప్లేటులేని వాహనాలు స్వాధీనం చేస్తున్న సీఐ చంద్రశేఖర్

నారాయణపేట రూరల్: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని సీఐ శివశంకర్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని వివిధ సర్కిల్‌లలో ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, ఇష్టారీతిగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా జర్నలిస్టులు కానివారు ప్రెస్ స్టిక్కర్లు పెట్టకోరాదన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు.

మక్తల్: నంబర్ ప్లేటులేని వాహనదారులు తప్పనిసరిగా వాటికి నంబర్ వేయించుకోవాలని సీఐ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు.. బైక్‌లు, ఇతర వాహనాలను తనిఖీ చేసి నంబర్ ప్లేటు లేని 20వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయొద్దని, మైనర్‌లకు బైక్‌లను, ఇతర వాహనాలను ఇవ్వొద్దన్నారు. ఆయనతోపాటు ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, ఏఎస్ఐ ఎల్లయ్య, పోలీసులు నరేష్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నర్వ: మద్యపానం సేవించి వాహనాలను నడపొద్దని ఎస్ఐ కురుమయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలను తనిఖీ చేసి వాహనాలు నడిపే వ్యక్తులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే వారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఆర్సీలు, ఇన్స్‌రెన్స్ పేపర్‌లను తప్పకుండా కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన ఉపాధ్యాయులు



మద్దూరు నుంచి సీఎం సభకు వెళ్తున్న ఉపాధ్యాయులు

కోస్గి: రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సీఎం కృతజ్ఞత సభకు కోస్గి, గుండుమాల్ మండలాల నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, తపస్ అధ్యక్షుడు అంజిలయ్య, రవీందర్ నాయక్, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నార్యా నాయక్‌తోపాటు పలువురు ఉపాధ్యాయులు సభకు వెళ్లారు.

మద్దూరు: తెలంగాణ ప్రభుత్వంలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసినా ఉపాధ్యాయుల సభకు ఉమ్మడి మద్దూర్ మండల నుంచి ఉపాధ్యాయులు శుక్రవారం తరలి వెళ్లారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రవి, సత్యనారాయణరెడ్డి, మాధవి తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం



కోస్గిలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శశిధర్



ధన్వాడలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిప్రకాష్



మద్దూర్‌లో..

కోస్గి: మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 5 నుంచి 9 వరకు చేపట్టే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మున్సిపల్ కమిషనర్ శశిధర్, చైర్‌పర్సన్ అన్నపూర్ణ సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలను, యువతను, మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలన్నారు. అనంతరం తేదిలా వారిగా చేపట్టే పనులను సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ వరకు ప్రత్యేకంగా చేపట్టినా స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మండలాధికారులు గ్రామ ప్రత్యేకాధికారులకు, కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంతో కార్యక్రమంపై వీరికి అవగాహన కల్పించారు. ఐదురోజుల్లో రోజూవారి కార్యక్రమాలను వారికి వివరించారు. మండల వైద్యాధికారి శ్రీలత, ఎంపీఓ రామన్న, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, పీఆర్ డిప్యూటీ ఈఈ విలోక్, ఎపీఓ సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5నుంచి 9వ వరకు ప్రత్యేకంగా చేపట్టినా స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ సాయిప్రకాష్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశంలో కార్యక్రమంపై వీరికి అవగాహన కల్పించారు. ఐదురోజుల్లో రోజూవారి కార్యక్రమాలను వారికి వివరించారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



దామరగిద్ద: ప్రభుత్వం మహిళా అభివృద్ధి కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని మహిళ సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నాసాగర్ రైతువేదికలో మహిళాభివృద్ధి, మహిళశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణసదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా బలపడి ఉపాధి, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మహిపాల్, ఏఈఓ తికల్‌రత్న, బీపీఎం నితిశ, అంగన్‌వాడీ టీచర్లు, రాములు, లాలప్ప పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం

మద్దూరు: ముస్లిం పవిత్ర స్థలం మాక్క వెళ్తున్న యాత్రికులకు శుక్రవారం మండలంలోని ముస్లిం మత పెద్దలు సన్మానించారు. మద్దూరుకు చెందిన తల్లీకొడుకులు ఆరిఫాబేగం, మహమ్మద్ సాబీర్‌లను పూలమాల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు షేక్‌అహ్మద్, సలీం, ఫీర్‌అహ్మద్, ముజీబ్, ఎక్బాల్, షబ్బీర్‌పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో అధిక లాభాలు



ఊట్కూరు: పాడి పరిశ్రమతో లాభాలు అధికంగా ఉంటాయని ఎంపీడీఓ ధనుంజయగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మండల పరిషత్ భవనంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో పశుపోషణపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. పాడి పరిశ్రమకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా, మహిళా సంఘాల సభ్యులకు సబ్సిడీ ద్వారా రుణాలను అందిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేదెలు, ఆవులు పెంచడం ద్వారా స్వయం ఉపాధి లభిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం నిర్మల, ఎంపీఓ నర్సింహరాజు, వెటర్నరీ అసిస్టెంట్ దివాకర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో ఇంటర్ మీడియట్ తరగతులలో స్పాట్ అడ్మిషన్లకోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ ఉంటుందని, ఉదయం 10:గంటల వరకు కళాశాలలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

వర్గీకరణపై 'సుప్రీం' తీర్పు హర్షణీయం



నారాయణపేటలో మందకృష్ణకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు



కోస్గిలో కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: సుదీర్ఘకాలం పాటు పోరాటం చేయడంతోనే చరిత్రాత్మక ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంఘం ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగకు పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకమని, ఈ విజయం మాదిగల 30 ఏళ్ల వర్గీకరణ పోరాట ఫలితమని అన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటేష్, సత్యనారాయణ, శరణప్ప, శ్రీను, సతీష్, మాణిక్యప్ప, మహాదేవ్, సత్యం విక్రమ్, గోపాల్ పాల్గొన్నారు.

కోస్గి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మండలంలోని పలు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక శివాజీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వేర్వేరుగా సంబరాలు, కృతజ్ఞత సభలు నిర్వహించారు. గుండుమాల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు వెంకటయ్య ఆధ్వర్యంలో పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటం ఉంచి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సీఎంకు కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. ఉమ్మడి పాలమూరు జేఏసీ నాయకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ చిత్ర పటాన్ని ప్రదర్శించి ఆయన కృషిని కొనియాడారు. అలాగే స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ దళిత మోర్చా, బీజేపీ మండల, పట్టణశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆయా సీబీ వెంకటేష్, రాములు, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, బద్రీనాథ్, శ్రీనివాస్, కిరణ్ కుమార్, రమేష్, పద్మ పాల్గొన్నారు.

మాగనూర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు సూతరి కృష్ణ, కర్రెప్ప, బందారి బస్వరాజు, గార్లపల్లి అశోక్, సాయిలు, తిమ్మప్ప, ఆంజనేయులు, హన్మంతు పాల్గొన్నారు.

నర్వ: సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు.. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గుడిసె వెంకటయ్య ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చుతూ.. తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ వీణావతి, డా. శంకర్, నాయకులు వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

ధన్వాడ: సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు.. బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, అంబేడ్కర్ సంఘం నాయకులు బాణాసంచా కాల్చుతూ.. తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు చింతన్‌పువ్వు నర్సింహులు, ఉదయభాను, మాజీ ఎంపీటీసీ ఉమేష్, రాంచద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్,తిరుపతయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ పోరాటాలతోనే పదోన్నతులు

కోస్గి: ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ పదోన్నతుల కోసం యూటీఎఫ్ చేసిన పోరాటంతోనే నేడు రాష్ట్ర వ్యాప్తంగా 30వేల మందికి ప్రమోషన్లు లభించాయని రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తున్న యూటీఎఫ్‌తోనే పదోన్నతులు, బదిలీలు సాధ్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిష్టయ్య, జిల్లా అధ్యక్షుడు శివరాములు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రాములు, నార్యానాయక్, సీనియర్ ఉపాధ్యాయులు జయప్రకాష్‌గౌడ్, రఘునాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గౌరప్ప, మల్లికార్జున్ పాల్గొన్నారు.



తల్లిపాలు శిశువుకు శ్రేయస్కరం



ఊట్కూరులో తల్లిపాల వారోత్సవాలలో పాల్గొన్న వైద్య సిబ్బంది



నర్వలో..

ఊట్కూరు: పుట్టిన బిడ్డకు అమ్మపాలే అమృతమని డా భవాని అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు విధిగా తాపించాలని, తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. బాలింతలు, గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గోవిందమ్మ, అంగన్‌వాడీ టీచర్లు వెంకటేశ్వరమ్మ, రిజ్వానబేగం, వైద్య సిబ్బంది నర్సింహులు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని కల్వాల్ సబ్‌సెంటర్ వైద్యురాలు డా కీర్తి అన్నారు. శుక్రవారం కల్వాల్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ మేరకు.. గర్భిణీ, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర్, అంగన్‌వాడీ టీచర్, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్



మద్దూరు: మాజీ సర్పంచ్‌లు గతంలో చేసినా పనులకు బిల్లులు చెల్లించాంటూ సర్పంచ్ ఫోరం చేపట్టినా చలో అసెంబ్లీ సందర్భంగా శుక్రవారం మండలంలోని బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం పోలీసులు స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారికి బీఆర్ఎస్ నాయకులు నరేష్, చంద్రశేఖర్, తదితరులున్నారు.

హామీలు అమలు చేయాలి



శ్యాసన్‌పల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని శ్యాసన్‌పల్లి, పేరపళ్ల గ్రామాల్లో కరపత్రాలు పంచి మాట్లాడారు.. ఈ నెల 8న కలెక్టరేట్‌ల ముట్టడి, 21న చలో హైదరాబాద్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సాయిలు, కృష్ణయ్య, వెంకటయ్య, రాజు, హన్మంతు, శివ పాల్గొన్నారు.

కోస్గి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు యాదగిరి, రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచిన నేటికి ఆరు గ్యారంటీలు అమలు చేయలేదన్నారు. ప్రజాపాలన పేరుతో తీసుకున్న దరఖాస్తులు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ నెల 8న కలెక్టరేట్‌ల ముట్టడి, 21న చలో హైదరాబాద్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. నాయకులు కొండన్న, కిష్టప్ప, బాలయ్య, హన్మంతు, మైబు, నర్సింహులు, వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ప్రభుత్వం ఎన్నిక ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మాస్ లైన్ మండల అధ్యక్షుడు తాయప్ప ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ జయరాములుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రైతులు పాల్గొన్నారు.